క్లుప్తంగా

వేగంగా షాదీమహల్ నిర్మాణ పనులు



షాదీమహల్ వద్ద బోర్ డ్రిల్ చేసేందుకు పాయింట్‌ను పరిశీలిస్తున్న గంగాధరం

సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లె, సోమల పంచాయతీలలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో నిర్మిస్తున్న షాదీమహల్ నిర్మాణ పనులు శరవేగంగా చేస్తున్నట్టు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గంగాధరం తెలిపారు. మంగళవారం షాదీమహల్ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన షాదీ మహల్ వద్ద కొత్తగా బోరు వేసేందుకు పాయింట్ గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ గణపతి, మండల మైనారిటీ విభాగం అధ్యక్షుడు మస్తావలీ, మాజీ సర్పంచ్ బషీర్, మాజీ ఎంపీటీసీ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న డీటీ

సోమల: మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లె పంచాయతీలో ఈవీఎంలు, వీవీ ప్యాట్లపై డీటీ రామ్మూర్తి మంగళవారం అవగాహన కల్పించారు. రాబోవు ఎన్నికల నేపథ్యంలో వాటిని వినియోగించే విధానంపై గ్రామస్తులకు వివరించి మాక్ పోలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శీలం సిద్దులమ్మ, వాటర్ షెడ్ చైర్‌పర్సన్ పుష్పావతి, వైఎస్సార్ సీపీ నేతలు హరినాథ, పాచ్చా సాహెబ్, మహేష్, వీఆర్‌ఓ శివయ్య పాల్గొన్నారు.

కరాటేలో పతకాల పంట



కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులతో మాస్టర్ సదాశివ

పుంగనూరు: పట్టణంలోని పులినాడు కరాటే అకాడమి విద్యార్థులు సోమవారం ముంబైలో జరిగిన ఇండో–నేపాల్ జీకేఎంఏ కరాటే పోటీల్లో మన రాష్ట్రం తరపున పాల్గొన్న 10 మంది విద్యార్థులు బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. మంగళవారం కరాటే మాస్టర్ సదాశివ మాట్లాడుతూ, అండర్–13 విభాగంలో కుమితే (ఫైటింగ్) విభాగంలో మిథున్, గగన్‌దీప్, ఎదునాథ్‌సాయి, శశాంక్‌కు బంగారు పతకాలు, బ్లాక్ బెల్ట్ కేటగిరిలో హేమేష్, రోహన్, రుహిత్, వరుణ్ రజత, కాంస్య పతకాలు పొందారన్నారు. వారిని పలువురు అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



డ్రోన్‌తో నానో ఎరువులు పిచికారీ చేయడంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దపంజాణి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండలంలోని దాసనంపల్లె, చిన్నేపల్లె గ్రామాలలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర గ్రామ సభలు నిర్వహించారు. ఎంపీడీఓ అబ్దుల్ రహీం మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు అర్హులకు అందేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పథకాల వివరాలతో రూపొందించిన వీడియోలను ప్రదర్శించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈఓ గోపాల్ రెడ్డి, పెద్దపంజాణి వైద్యాధికారి మురళి, వ్యవసాయాధికారి రబీబా, పీఎస్‌లు గణపతి, జప్రుల్లా, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు

జగనన్న పాలవెల్లువ కేంద్రాలు ప్రారంభం

గంగవరం: మండలంలోని కల్లుపల్లె, కలగటూరు గ్రామాల్లో జగనన్న పాలవెల్లువ కేంద్రాల నూతన భవనాలను ఎమ్మెల్యే వెంకటేగౌడ చేతుల మీదుగా బుధవారం ప్రారంభిస్తున్నట్టు పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు కల్లుపల్లె, 10 గంటలకు కలగటూరు గ్రామాల్లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మున్సిపల్ సమావేశం

పలమనేరు: పలమనేరు పురపాలక సంఘ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు, కో–ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు హాజరు కావాలని కోరారు.

సదుం: నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ–2 దామోదర



పులిచెర్ల హైస్కూల్లో..



గంగవరం : నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు



విజ్ఞానమేళాతో సృజనాత్మకతకు పదును

పుంగనూరు: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన మండల స్థాయి విజ్ఞానమేళాలో ఉత్తమ నమూనాలను ఎంపిక చేసి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మంగళవారం స్థానిక బసవరాజ ప్రభుత్వ హైస్కూల్‌లో ఈ కార్యక్రమాన్ని ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి ఆధ్వర్యంలో నిర్వహించారు. గత వారం 138 పాఠశాలల్లో గ్రామీణ స్థాయి విద్యార్థులు ఎంపిక నిర్వహించారు. వారిలో మండల స్థాయి వారిని ఎంపిక చేసినట్లు ఎంఈవో తెలిపారు. కొత్తయిండ్లు హైస్కూల్‌కు చెందిన హారిక, మోడల్ స్కూల్ విద్యార్థి నాగసాయిరెడ్డి, మేలుపట్ల హైస్కూల్ విద్యార్థి తరుణ్‌నాయక్ బహుమతులు అందుకున్నారు. తమ వైజ్ఞానిక విజ్ఞానాన్ని పెంపొందించుకుని విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎంఈఓలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: స్థానిక జెడ్పీ హైస్కూల్లో మంగళవారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. సదుం, బూరగమంద, చెరుకువారిపల్లె, పాలమంద విద్యార్థులు తాము రూపొందించిన నమూనాలను ప్రదర్శించారు. వీటిని ఎంఈఓ–2 దామోదర పరిశీలించారు. ప్రతిభ చూపిన పూర్ణచంద్ర(బూరగమంద), వినయ్, మహమ్మద్ హఫిక్, (ఎంజేపీ, గురుకుల), ఉపాధ్యాయుల విభాగంలో దామోదర (సదుం) జిల్లా స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం సుబ్రమణ్యం చెప్పారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల హైస్కూల్లో మంగళవారం ఎంపీపీ సురేంద్రనాధరెడ్డి విజ్ఞానమేళాను ప్రారంభించారు. మండలంలోని ఐదు హైస్కూళ్లు, యూపీ స్కూల్ విద్యార్థులు వ్యక్తిగతంగా, జట్టుగా వివిధ అంశాలపై తయారుచేసి ప్రదర్శించినన నమూనాలను తిలకించారు. ఉత్తమ నమూనాలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపికైన వాటిని జిల్లాస్థాయి మేళాకు పంపనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాణెమ్మ, వైస్ ఎంపీపీ ఈశ్వరి, ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, నాయకులు రవీంద్రనాథరెడ్డి, ప్రభాకర్, గోవర్ధన్, హెచ్‌ఎం సయ్యద్‌షావల్లీ తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలపై మక్కువ ముఖ్యం

గుడుపల్లె: విద్యార్థులకు వైజ్ఞానిక ప్రదర్శనలపై మక్కువ కలిగి ఉండాలని జిల్లా ఉప విద్యాశాఖ దికారి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక మోడల్ స్కూల్‌లో 13 జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల ప్రయోగాత్మకంగా నేర్చుకుంటే మరింత అవగాహన పెరుగుతుందన్నారు. దేశాభివృద్ధి శాస్త్ర, సాంకేతిక రంగాల పురోగతిపై ఆధారపడి ఉందని, విద్యార్థులు ఈ రంగాల వైపు దృష్టి సారించాలన్నారు. ఉత్తమ నమూనాలను ఎంపిక చేసి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంపీపీ వరలక్ష్మి, సమగ్ర శిక్ష సీఎంఓ ఉదయశ్రీ, ఎంపీడీఓ తాజ్ మస్రూర్, కళాశాల ప్రిన్సిపల్ భువనేశ్వరి, సైన్సు విభాగానికి చెందిన భాగ్యశ్రీ, రమణ, అరుణ, ఎంఈఓ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



అరుణను సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న డీవైఈఓ చంద్రశేఖర్ తదితరులు

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: విద్యార్థులు సైన్సుపై మక్కువ పెంచుకోవాలని ఎంఈఓ ఇందిర అన్నారు. మంగళవారం బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్సు విజ్ఞాన మేళా నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ, విద్యార్థుల్లో నిబిడీకృతమైన సృజనాత్మకతను పదును పెట్టి వెలికితీయడానికి విజ్ఞాన మేళా దోహదం చేస్తుందని, వారి ఆలోచనలకు పదును పెడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఇక్కడ ఎంపికైన నమూనాలను ఈ నెల 22న చిత్తూరులో నిర్వహించనున్న జిల్లా స్థాయి సైన్సు విజ్ఞాన మేళాలో ప్రదర్శించనున్నట్టు పేర్కొన్నారు. గానుగచింత, పెద్దమల్లెల, రొంపిచెర్ల బాలుర, బాలికల, ఉర్దూ, బొమ్మయ్యగారిపల్లె, అదర్శ పాఠశాల, కేజీబీవీ పాఠశాల విద్యార్థులు సైన్సు విజ్ఞాన మేళాలో తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు లోకనాథరెడ్డి, రమేష్, ప్రకాష్, కృష్ణయ్య, లక్ష్మి, రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: మండల స్థాయి సైన్సు ఎగ్జిబిషన్ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 50 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. టీచర్ల విభాగం నుంచి దొడ్డిపల్లె హైస్కూల్‌కు చెందిన నాగేంద్రబాబు, విద్యార్థుల విభాగం నుంచి కొలమాసనపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన సాంబశివారెడ్డి, గ్రూపు విభాగంలో దొడ్డిపల్లెకు చెందిన చరణ్‌తేజ్, ప్రణీత్‌రెడ్డి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంఈఓ బాలసుందరం తెలిపారు. కార్యక్రమంలో పలువురు సైన్సు గైడ్ టీచర్లు, ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

గంగవరం హైస్కూల్‌లో..

గంగవరం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను మంగళవారం ఎంఈఓ–1 వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈవో– 2 శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు సోలార్‌సైకిల్, రోడ్డు ప్రమాదాల నివారణ, సోలార్ కిట్ల తయారీ, బ్లైండ్ మ్యాన్ స్టిక్, సురక్షిత ప్రయాణం..ఇత్యాది నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. న్యాయనిర్ణేతలు మొత్తం 9 ఉత్తమ నమూనాలుగా ఎంపిక చేశారు. గ్రూపుస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల విజేతలతోపాటు, వ్యక్తిగత స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేత యుగంధర్(ఎల్‌బీసీ), హైస్కూల్ హెచ్‌ఎం పరశురాం, దొడ్డిపల్లె స్కూలు హెచ్‌ఎం నేతాజి, ఉపాధ్యాయులు పాండు, విజయశేఖర్, రూపలత, దేవేంద్ర, ప్రతాప్, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

రామకుప్పంలో..

రామకుప్పం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలను ఎంఈఓ నారాయణ పరిశీలించారు. రామకుప్పం గురుకుల పాఠశాల విద్యార్థులు దినేష్, పార్థసారథి, లోహిత్ ప్రదర్శించిన నమూనాలను జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక చేసినట్లు నోడల్ ప్రధానోపాధ్యాయురాలు సుజాత తెలిపారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రామచంద్రన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పుంగనూరు : మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విద్యార్థులు



రొంపిచెర్ల: బహుమతులు గెలుచుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



రామకుప్పం : సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ

భరత్‌ను ఆదరించండి



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దుర్గ

కుప్పం: ఎమ్మెల్సీ భరత్‌ను ఈసారి రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన సతీమణి దుర్గ ప్రజలను అభ్యర్థించారు. మంగళవారం ఆమె కుప్పం మున్సిపాలిటీలోని అర్బన్ కాలనీలో పర్యటించారు. మహిళలకు పసుపు, కుంకుమ, చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. తన భర్తను ఆశీర్వదించాలని కోరారు. ఆయన్ను ఆదరించి గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటామన్నారు. ఇప్పటికే ఎమ్మెల్సీగా ఆయన పనితీరు ఎలా ఉందో ప్రజలు ప్రత్యక్షంగా చూశారని, ఆయన అందరితో మమేకమై సమస్యలను పరిష్కరిస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని పార్టీకి మరోసారి పట్టం కట్టాలని కోరారు.

న్యాయవాదుల రిలే దీక్షలు

పుంగనూరు: ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని న్యాయవాదులు మంగళవారం రిలేదీక్షలకు పూనుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివశంకర్‌నాయుడు మాట్లాడారు. న్యాయవాదులు వీరమోహన్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, వెంకటరెడ్డి, పులిరామకృష్ణారెడ్డి, గిరి, ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాంపల్లె వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు..

పుంగనూరు: మండలంలోని రాంపల్లె వద్ద గల ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం కూడా నిరసన దీక్ష కొనసాగించారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు దీక్షలు విరమించేది లేదన్నారు. ఇదలా ఉంచితే, అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తుండడంతో కేంద్రాల నిర్వహణ బాధ్యతను సచివాలయ ఉద్యోగులు స్వీకరించారు.

టీచర్లను నియమించాలని ఆందోళన

పుంగనూరు: పట్టణంలోని ఉర్దూ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం సాయంత్రం ఎంఈఓ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. సంవత్సరాలు గడుస్తున్నా 130 మంది విద్యార్థులకు ఒకే టీచర్‌ను నియమించి రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా ఐక్యతా దినోత్సవం

పుంగనూరు: హిందూ–ముస్లిం బాయీ..బాయ్ అంటూ ఐక్యతా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏపీజే అబ్దుల్ కలామ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అయాబ్‌ఖాన్ ఆధ్వర్యంలో గోకుల్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, డిసెంబర్ 19న హిందూ–ముస్లిం ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించడం శుభపరిణామమన్నారు. పుంగనూరులో తొలినుంచీ హిందువులు, ముస్లింలు పరమత సహనం పాటిస్తూ కలసిమెలసి ఉంటున్నట్టు చెప్పారు.



పేడదిబ్బల సమస్యపై ఫిర్యాదు



ఎంపీడీఓ, తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయునివారిపాళ్యం వాసులు

చౌడేపల్లె: తమ సమస్యను పరిశీలించి పరిష్కరించాలని చౌడేపల్లె పంచాయతీ నాయనివారిపాళ్యంమహిళలు ఎంపీడీఓ సుధాకర్, తహసీల్దార్ మాధవరాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని కమ్యూనిటీ భవనం పక్కన పేడదిబ్బలు వేయడంతో దుర్గంధం వెదజల్లుతూ, దోమలు, విషపురుగులకు ఆవాసంగా మారిందని సమస్యను నివేదించారు. అక్కడే స్కూలు కూడా ఉందని చెప్పారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ





భూమి పూజ చేస్తున్న సర్పంచ్ కుమారస్వామి, వి.కోట : పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ యువరాజు

కుప్పం రూరల్: మండలంలోని చందం పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం సర్పంచ్ కుమారస్వామి భూమి పూజ చేశారు. రూ.20 లక్షలతో 400 మీటర్ల రోడ్లను వేయనున్నట్టు ఆయన చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం తమ గ్రామంలో పూర్తిస్థాయిలో సీసీ రోడ్లు వేయలేదని, జగనన్న ప్రభుత్వంలో తమ గ్రామంలోని రోడ్లు సుందరంగా తయారు కానున్నాయని చెప్పారు.

వి.కోట మండలంలో..

వి.కోట: మండలంలోని యాలకల్లు పంచాయతీ కల్లుపల్లెలో జీజీఎంపి నిధులు రూ.20లక్షలు, ఎంజీఎన్ ఆర్‌జీఎస్ నిధులు రూ.5లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం ఎంపీపీ యువరాజు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమీజాబీ, ఎంపీటీసీ విజయశాంతి, కృష్ణప్ప, పంచాయతీ కన్వీనర్ గోవిందప్ప, ముఖ్య నాయకులు జయరామిరెడ్డి, సుబ్బారెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతులకు చేయూతనిస్తా



స్వెటర్లు పంపిణీ చేస్తున్న బాల గురునాథ్

వి.కోట: ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాల విద్యార్థులకు తమవంతు చేయూత ఎల్లప్పుడూ ఇస్తానని ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాలగురునాథ్ అన్నారు. మంగళవారం తన 56వ జన్మదినం పురస్కరించుకుని పట్టణంలోని ప్రత్యేక ప్రతిభావంతుల ఆదర్శ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. పాఠశాల నిర్వాహకురాలు భార్గవికి ఆయన రూ.12 వేలు విరాళమిచ్చారు. విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ చేశారు. అలాగేభవిత కేంద్రంలో స్వెటర్లు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక వాణి పాఠశాలలో మండలంలోని నిరుపేద విద్యార్థులకు, షికారీలకు, ప్రత్యేక ప్రతిభావంతులకు దుప్పట్లు పంపిణీ చేయడంతోపాటు అన్నదానం చేశారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీ తమీమ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనకు జన్మదిన శుభాకంక్షలు తెలిపారు.

మోటార్ సైకిళ్లు ఢీ : వీఆర్వోకు గాయాలు



గాయ పడిన వీఆర్వో వెంకటరమణ

రొంపిచెర్ల: మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో వీఆర్వో గాయపడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు..రొంపిచెర్ల వీఆర్వో వెంకటరమణ పీలేరు నుంచి బైక్‌లో రొంపిచెర్లకు వస్తుండగా బుసిరెడ్డిగారి పల్లె సమీపంలో ఎదురు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వీఆర్వోతోపాటు ఢీకొన్న వాహనంలో వస్తున్న గర్భవతి కూడా గాయపడింది. వారిద్దరినీ పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రొంపిచెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయ సేవలు మరింత మెరుగు

- ఉద్యోగులకు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశం



అంబేడ్కర్ నగర సచివాలయంలో రిజిస్టర్లను పరిశీలించి మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: సచివాలయాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలు మరింత మెరుగు పడేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం మండలంలోని కుంబార్లపల్లె, వి.కోట గ్రామ సచివాలయం–1, అంబేడ్కర్ నగర్ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్, సీఎల్ ఎంట్రీస్, మూవ్‌మెంట్స్ రిజిస్టర్లను పరిశీలించి ఆయన మాట్లాడారు. మండలంలో జగనన్న గృహ నిర్మాణ పనులపై నిత్యం పర్యవేక్షణ ఉండాలన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో మంజూరు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు కోసం సమష్టి కృషి



ఆర్వీ సుభాష్‌తో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: ఇటీవల టీడీపీ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన పట్టణానికి చెందిన బాలాజీ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ సుభాష్ చంద్రబోస్‌ను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కలిశారు. మంగళవారం సాయంత్రం బోస్‌ను ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ముచ్చటించారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం సమష్టిగా కృషి చేద్దామని వారు చర్చించుకున్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



రామకుప్పం : క్రిష్టప్ప మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న భరత్

రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరు గ్రామ సచివాలయ వలంటీర్ వెంకటేష్ తండ్రి క్రిష్టప్ప మంగళవారం మృతిచెందారు. ఇది తెలుసుకున్న చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ మల్లిక, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ, నేతలు గోవిందప్ప, గజేంద్ర, సత్య, మంజు పాల్గొన్నారు.

కుప్పంలో..



కుప్పం : నగదు అందజేస్తున్న కౌన్సిలర్ హఫీజ్

కుప్పం: మున్సిపాలిటీ 9వ వార్డుకు చెందిన మృతుల కుటుంబాలకు స్థానిక కౌన్సిలర్ హఫీజ్ ఆర్థిక సాయం అందజేశారు. మూడు రోజుల క్రితం రంగప్ప(70), మంగళవారం అలగమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. రూ.10వేల చొప్పున ఒక్కో కుటుంబానికి ఎమ్మెల్సీ భరత్ ప్రకటించారు. ఆ సొమ్మును పార్టీ నాయకులు అందజేశారు.

కోవిడ్ సబ్ వేరియంట్‌పై అప్రమత్తం

- ప్రజలు తగు జాగ్రత్తలను పాటించాలి
- స్థానిక ఏరియా ఆస్పత్రిలో కోవిడ్ చికిత్సకు సన్నద్ధం
- ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ రామ్మూర్తి నాయక్



మాట్లాడుతున్న ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ రామ్మూర్తి నాయక్

పలమనేరు: కేరళలో జేఎన్–1 కోవిడ్ సబ్ వేరియంట్ కేసులు వెలుగుజూసిన నేపథ్యంలో ఇక్కడ కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలమనేరు ఏరియా ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ రామ్మూర్తి నాయక్ హెచ్చరించారు. ఆస్పత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, ఆర్‌ఎంఓ శారదతో కలసి మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జేఎన్–1 వైరస్ ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపించే అవకాశం ఉంటుందన్నారు. అయితే గతంలో మనం కోవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, ఈ పర్యాయం సబ్ వేరియంట్ ప్రభావం పెద్దగా ఉండదని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రజలు గతంలో లాగే చేతులను శుభ్రం చేసుకోవడం, మాస్కుల ధరించి సామాజిక దూరం పాటించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇక్కడి ఆస్పత్రిలో కోవిడ్ రోగులకు అవసరమైన చికిత్స చేసేందుకు అన్ని ఏర్పాటు చేశామన్నారు. చెంగారెడ్డి మాట్లాడారు. సమావేశంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.